తూర్పు గోదావరి
వార్త
సోమవారం 23, ఏప్రిల్ 2018 8 పేజీలు




ఎంసెట్ కోడ్ విడుదల చేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

## ప్రశాంతంగా

# ఏపీ ఎంసెట్

### -కీ విడుదల చేసిన మంత్రి గంటా

### మొదటిరోజు 30మంది గైర్హాజరు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంసెట్ పరీక్షను జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణాలోని హైదరాబాద్‌లో కూడా ఈ నెల 22,23,24,25 తేదీల్లో ఎంసెట్ పరీక్ష నిర్వహిం చేందుకు జేఎన్‌టీయూకే చర్యలు చేపట్టింది. 22వ తేది నిర్వహించే ఇంజనీరింగ్ ఆన్‌లైన్ పరీక్ష కోడ్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం జేఎన్‌టీయూ కాకినాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మానవ వనరులు, విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాస రావు హాజరయ్యారు. ఎంసెట్ 2018 ఛైర్మన్, ఇన్‌ఛార్జ్ వీసీ ఎస్.రామ కృష్ణారావు, అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి మూడుసార్లు ఎంసెట్ పరీక్ష నిర్వహించే అవకాశం కాకినాడ జేఎన్‌టీయూకు కల్పించామన్నారు. పటిష్టంగా పరీక్షలు నిర్వహిం చడంతోనే ఈ అవకాశం లభించిం దన్నారు. విద్యకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతు ందన్నారు. లోటు బడ్జెట్‌లో కూడా విద్యకు ప్రాధాన్యత కల్పించామన్నారు. అన్ని సెట్‌ల పరీక్షల్లో ఎంసెట్‌కు ప్రాముఖ్యత ఉందని, దీనికి సంబంధించి ఎటువంటి అవకతవకలు లేకుండా ఉండేలా గత ఏడాది నుంచే ఆన్‌లైన్ పరీక్ష విధానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దాదాపు మూడు లక్షల మంది ఆన్‌లైన్‌పరీక్ష రాయడం జరిగిందన్నారు. అన్ని యూనివర్శిటీలు ఎంసెట్ నిర్వహణ అవకాశం కల్పించాలని కోరినప్పటికీ విజయవంతంగా పరీక్షలు నిర్వహించిన కారణంగా జేఎన్‌టీయూకేకు అవకాశం కల్పి ంచామన్నారు. ఆన్‌లైన్ విధానంద్వారా త్వరితగతిన ఫలితాలు విడుదల కావడంతోపాటు ఇతర రాష్ట్రాలకు విద్యార్థులు తరలిపోయే అవకాశం తగ్గుతుందన్నారు. మన రాష్ట్రంతోపాటు హైదరాబాదులో కూడా జరిగే ఎంసెట్ ప్రవేశ పరీక్షను ఈ నెల 22,23,24,25 తేదీల్లో రెండు విడతలుగా నిర్వహి స్తారన్నారు. ఉదయం 10గంటల

మిగతా 3లో

## ప్రశాంతంగా ఎంసెట్

నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30వరకు ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థుల సాధకబాధలను అర్థం చేసుకుని ఎప్పటినుంచో అమల్లో వున్న నిమిషం ఆలస్యాన్ని సడలించాలని, విద్యార్థుల ఆలస్యానికి సరైన కారణాలు చూపితే ఒకటి లేదా రెండు నిమిషాలవరకు పరీక్షకు అనుమతించాలని సూచించారు. ఎంసెట్ పరీక్షకు సంబంధించిన ప్రిలిమనరీ కీ ఈ నెల 25 విడుదల చేస్తారన్నారు. పరీక్షా ఫలితాలు మే 3న విడుదల చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ9 కోడ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంసెట్ కన్వీనర్ సీహెచ్ సాయిబాబు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో 1,99,309మంది దరఖాస్తు చేసుకోగా, అగ్రికల్చర్ విభాగంలో 76,686మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొదటి రోజు నిర్వహించిన పరీక్షలో ఉదయం 32,772మంది హాజరు కావాల్సి ఉండగా 31,157మంది హాజరయ్యారన్నారు. 1615మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 32,762 మంది హాజరు కావాల్సి ఉండగా 31,117మంది హాజరయ్యారు. 1645మంది గైర్హాజరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, డైరెక్టర్లు, యూసీఈకె ప్రిన్సిపాల్ జివిఆర్ ప్రసాదరాజు, కోకన్వీనర్ శివనాగరాజు, కోఆర్డినేటర్లు జేవీఆర్ మూర్తి, బి.బాలకృష్ణ, ప్రోగ్రాం డైరెక్టర్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.